# ఎస్.ఎం.ఎస్

-ఎం.గాంధీ



శైలజ, మహేష్‌లకు కొత్తగా పెళ్లయింది. ఇద్దరూ వేరే వేరే ఆఫీసుల్లో పని చేస్తున్నారు. అందుచేత ఎప్పుడు వీలు దొరికినా తమ మొబైల్స్ నుండి సరదాగానో, రొమాంటిక్‌గానో ఎస్ఎంఎస్‌లు ఇచ్చి పుచ్చుకోవడాలు చేస్తుంటారు.

ఓరోజు శైలజ ఆఫీసులో ఉండగా వర్షం మొదలైంది. తన సీటు విండో పక్కన ఉండడంతో పడుతున్న వర్షాన్ని ఎంజాయ్ చేస్తోంది. నిజం చెప్పాలంటే ఆ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది.

ఈ సందర్భంగా తన భర్త మహేష్‌కు సరదాగా ఓ మెసేజ్ ఇవ్వాలనిపించి 'నాకు ఇప్పుడు నీ కౌగిలిలో ఒదిగిపోవాలని వుంది' అని టైప్ చేసి ఎస్ఎంఎస్ పంపించింది. దానికి ప్రతిగా తన భర్త ఎలాంటి మెసేజ్ ఇస్తాడో అని ఎదురు చూసింది. కానీ అక్కడ్నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు. బిజీగా ఉండి ఇవ్వలేకపోయాడేమోనని సరిపెట్టుకుంది.

***

మహేష్ ఆఫీస్ నుంచి ఇంటికొచ్చాక కాఫీ ఇస్తూ "ఈరోజు ఆఫీసులో చాలా బిజీగా ఉన్నావా?" అని గోముగా అడిగింది శైలజ.

"లేదే ఏం?" అన్నాడు కాఫీ అందుకుంటూ.

"మరైతే నేనిచ్చిన ఎస్ఎంఎస్ చూసుకోలేదా?" అంది శైలజ అతనిపక్కన కూర్చుంటూ.

"నువ్వెప్పుడిచ్చావ్?" అని పక్కనున్న మొబైల్ తీసుకుని చూసి "చూడు...ఇందులో లేదు" అన్నాడు.

"నువ్వు డిలీట్ చేసావేమో?"

"నేనం డిలీట్ చేయలేదుగానీ పొరపాటుగా అది ఎవరికో పంపించి వుంటావు. ఇంతకీ ఏమని ఎస్ఎంఎస్ పంపించావు?" అడిగాడు మహేష్ మంచంమీద రిలాక్స్ అవుతూ.

వెంటనే తన మొబైల్ చెక్ చేసుకుంది.

తను చేసిన పొరపాటు ఏమిటో శైలజకు ఇప్పుడు అర్థమైంది. తన భర్తకు బదులుగా తన కొలీగ్ మోహన్‌కు పొరపాటుగా ఎస్ఎంఎస్ చేసింది. పైపెచ్చు ఈరోజు మోహన్ ఆఫీసుకు రాలేదు. ఆయన ఈ ఎస్ఎంఎస్‌ను ఏ విధంగా అర్థం చేసుకుని ఉంటాడోనని సిగ్గుతో ఉక్కిరిబిక్కిరైంది శైలజ.

***

ఇంట్లో మోహన్ మొబైల్ రింగయింది. దాన్ని అతని భార్య శారద తీసుకుని చూసింది. ఇందాక సాయంత్రం తన భర్తకు ఎస్ఎంఎస్ ఏ మొబైల్ నుండి వచ్చిందో అదే నెంబర్ నుండి ఇప్పుడు మళ్లీ కాల్ రావడంతో ఆమె గుండె రగిలిపోయింది. బాగా తిట్టాలనే ఉద్దేశ్యంతో "హలో" అంది శారద.

కానీ అట్నుంచి మగగొంతు వినిపించడంతో తనకి తాను సర్దిచెప్పుకుంది.

"హలో...మోహన్‌గారు ఉన్నారాండీ" అడిగాడు మహేష్.

"లేరండి. ఇంట్లో మొబైల్ పెట్టి బయటకెళ్లారు" శాంతంగా చెప్పింది శారద.

"ఏమీలేదండీ. ఇందాక సాయంత్రం మా ఆవిడ నాకు ఓ మెసేజ్ ఎస్ఎంఎస్ చేయబోయి పొరపాటుగా అది మీ ఆయన నెంబర్‌కు పంపించింది. అది చెబుదామని ఫోన్ చేసాను" అన్నాడు మోహన్.

"చంపారు పొండి. ఆ మెసేజ్‌తో నాకూ మా ఆయనకూ పెద్దగొడవైంది. దాంతో ఆయనకు కోపమొచ్చి బయటకెళ్లిపోయారు" అని ఫోన్ కట్ చేసింది శారద. అనవసరంగా తన భర్తను అనుమానించి గొడవ పెట్టుకున్నందుకు గిల్టీగా ఫీలైంది.

తన భర్త ఇంటికి రాగానే 'సారీ' చెప్పాలని మోహన్ రాకకోసం ఎదురు చూస్తూ కూర్చుంది శారద.

☆